క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ గుడివాడకు పతకాల పంట



గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాలకు గాను 11 అవార్డులు సాధించినట్లు క్లబ్ అధ్యక్షుడు విస్సంశెట్టి కృష్ణకిషోర్ తెలిపారు. లయన్స్‌క్లబ్ కార్యాలయంలో సాధించిన పతకాలను మంగళవారం మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2023–24 సేవా కార్యక్రమాలకు గాను తమ క్లబ్ ఉత్తమ సేవా అవార్డుతో పాటు కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు, ఉచిత భోజన సౌకర్యం, విద్యార్థులకు వైద్య పరీక్షలు, తదితర కార్యక్రమాలకు ప్రత్యేక అవార్డులు సాధించామన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడకు ఇన్ని అవార్డులు రావడం తమకు సహకరించిన క్లబ్ సభ్యుల కృషి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పలపాటి సతీష్, కోశాధికారి వేణుగోపాలస్వామి, డీసీ వైవీ. కృష్ణారావు, సభ్యులు ఎస్.శివశంకర్, పి.సతీష్, టి. తిరుపతిరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి



పమిడిముక్కల: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని మొక్కల సంరక్షణ సంచాలక కార్యాలయం అధికారి బి.వేణుబాబు రైతులకు సూచించారు. కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం(విజయవాడ), వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాపురం, మేడూరు గ్రామాల్లో మంగళవారం రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలలో సమగ్ర సస్యరక్షణ ఆవశ్యకతను మొక్కల సంరక్షణ సంచాలక కార్యాలయ అధికారి బి.వేణుబాబు రైతులకు వివరించారు. ఏఓ గణేష్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు ఎస్‌ఐగా అర్జునరాజు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎస్‌ఐగా ఎం.అర్జునరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మచిలీపట్నం పోలీస్ కంట్రోల్ రూం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన పి.విశ్వనాథ్‌ను జిల్లా అధికారులు వీఆర్‌కు పంపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

పామర్రు: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికాంత్‌ను మండలంలోని కొండిపర్రు గ్రామస్తులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను వివరించారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చి, సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తహసీల్దార్‌ను కలిసినిన వారిలో నూకారపు వీరాంజనేయులు, పసుపులేటి విజయ్‌కుమార్, మదంశెట్టి సత్యనారాయణ, ఏకుల చిరంజీవి ఉన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. స్థానిక గురజ రోడ్డులో డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి, అంబేడ్కర్ నగర్ వద్ద రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. ఈ ఆక్రమణల వలన అనేక అవస్థలు పడుతున్నట్లు పంచాయతీ పాలక వర్గానికి ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



కైకలూరు: విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. కలిదిండి మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కలిదిండి, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సైతం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైఎస్ ఎంపీపీ నాగలక్ష్మీ, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీల కనకదుర్గ, కూటమి నేతలు పోకల జోగిరాజు పాల్గొన్నారు.

ముద్ద చర్మవ్యాధి నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

- నియోజకవర్గంలో 5,343 ఆవులు
- ఉచితంగా గోట్ ఫ్యాక్స్ టీకాలు
- ఈ నెల 20 వరకు టీకాలకు అవకాశం



కైకలూరులో వీధి ఆవులకు గోట్ ఫ్యాక్స్ టీకా వేస్తున్న పశువైద్యులు

కైకలూరు: ఆవుల్లో ముద్ద చర్మవ్యాధి రాకముందే పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు పేర్కొన్నారు. తెల్లటి ఆవు చర్మంపై పెద్ద పెద్ద బొబ్బలు వస్తే దాన్ని లంపీ స్కిన్ డిసీజ్ (ఎల్‌ఎస్‌డీ) అంటారని తెలిపారు. తెలుగులో దీనిని ముద్ద చర్మ వ్యాధిగా పిలుస్తారని పేర్కొన్నారు. కాప్రి ఫ్యాక్స్ వైరస్ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఇది ఎక్కువగా ఆవులకు సోకుతుందని పేర్కొన్నారు. దోమలు, ఈగలు, పేలు వల్ల ఈ వ్యాధి ఇతర ఆవులకు సంక్రమిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఈ వ్యాధి నివారణకు ఉచితంగా గోట్ ఫ్యాక్స్ టీకాలను అందిస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 20 వరకు ఉచిత వ్యాక్సిన్ అందిస్తున్నారని తెలిపారు.

నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మొత్తం 5,343 ఆవులను పశువైద్య సిబ్బంది గుర్తించారు. ఇప్పటివరకు గోట్ ఫ్యాక్స్ టీకాలను ఉచితంగా 4,900 ఆవులకు అందించారు. మిగిలిన టీకాలను కొనసాగిస్తున్నారు. ఆవుల యజమానులు మండల ప్రధాన కేంద్రాల్లో విడిచిపెట్టడం వల్ల వీటి సంచారం అధికమైంది. వెటర్నరీ సిబ్బంది వీధి సంచార ఆవులను కూడా గుర్తించి టీకాలను వేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారుగా 90 శాతం వ్యాక్సినేషన్ అందించినట్లు పశువైద్యులు తెలిపారు.

ముందుగానే గుర్తించండి..

ఆవులలో ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధిని అదుపు చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఆవుల శరీరంపై 2–5 సెంటీమీటర్ల వ్యాసం కలిగిన చర్మపు బొబ్బలు, తల, మెడ అవయవాలు, పొదుగు జననేంద్రియాలపై కనిపిస్తాయి. దీంతో ఆవుల్లో అధిక జ్వరం, పాల దిగుబడులు తగ్గడం, కళ్లు, ముక్కు నుంచి స్రవాలు, లాలాజలం కారడం, ఆకలి తగ్గడం, గర్భస్రావం తదితర లక్షణాలు కనిపిస్తాయి. కణితలతో చర్మం



లంపీ వైరస్ సోకిన ఆవు

కాలినట్లు కనిపించడం, తర్వాత దశలో చర్మం అట్టగట్టి పెలుసుగా ఊడిపోవడం జరుగుతోంది. ఈ వ్యాధిని హిస్టోపాథాలజీ, వైరస్ ఐసోలేషన్, పాలిమిరైజిడ్ చైన్ రియాక్షన్(పీసీఆర్) టెస్టుల ద్వారా గుర్తించవచ్చు.

గోసంరక్షకులూ.. ఇవి పాటించండి

- వ్యాధి సోకిన ఆవుల గ్రామాలను గుర్తించి రింగ్ వ్యాక్సినేషన్ చేయించాలి.
- వ్యాధి సోకితే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆవులను తరలించకూడదు.
- పూర్తిగా కోలుకునేవరకు ఇతర ఆవులకు వ్యాధి సోకిన గోవులను కలపరాదు.
- బాహ్య పరాన్న జీవుల నివారణకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలి.
- వైరస్‌తో మరణిస్తే కళేబరాలను లోతైన గుంతలో, ఉప్పు, సున్నం వేసి పూడ్చివేయాలి.
- వైరస్ తగ్గే వరకు పశువుల ప్రదర్శన నిషేధించాలి.
- వైరస్ గుర్తించిన ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల మేర పశువుల సంతలను మూసివేయడం మంచిది.
- ఆవులు నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి.

90 శాతం టీకాల పంపిణీ



లంపీ వైరస్ నివారణకు గోట్ ఫ్యాక్స్ టీకాలను 90 శాతం పంపిణీ చేశాం. ఈ వ్యాధి వ్యాప్తి రేటు 10 నుంచి 12 శాతం ఉండగా మరణాల రేటు 1–5 శాతం మాత్రమే ఉంటుంది. గోసంరక్షకులు భయపడవద్దు. నాలుగు నెలల వయసు పైబడిన ఆవులకు టీకాలు వేస్తారు. ఇప్పటివరకు టీకాలు వేయించకుండా ఉండే ఆవుల యజమానులు పశువైద్యులు, గోపాలమిత్రలు, సచివాలయ పశు సంవర్థక సహాయకులను సంప్రదిస్తే గోవులకు టీకాలు వేస్తారు.

– పి.ముస్తాఫఖాన్, పశుసంవర్థక సహాయ సంచాలకులు, కైకలూరు

గుడివాడ–కంకిపాడు రోడ్డును అభివృద్ధి చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: గుడివాడ–కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో ప్రధాన రహదారుల్లో ఉన్న గుంతలను పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ రహదారుల అభివృద్ధి, మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ఏఎన్ఆర్ కళాశాల నుంచి వెంట్రప్రగడ వరకు రూ.5కోట్లతో రివిట్‌మెంట్‌తో పాటు రహదారిని కూడా నిర్మిస్తామన్నారు. వెంట్రప్రగడ నుంచి నందమూరు వరకు రహదారి మరమ్మతులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి ఎస్ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుడివాడ బైపాస్ రోడ్డును నేషనల్ హైవేలో విలీనం చేయాలని ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కేంద్రమంత్రి గడ్కరీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో రహదారి విలీన ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీఈ కామేశ్వరరావు పాల్గొన్నారు.

కలుపు నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలి



సింగరాయపాలెంలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముదినేపల్లి రూరల్: సార్వా వరిసాగులో కలుపు నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఎన్.నాగేంద్రబాబు రైతులకు సూచించారు. మండలంలోని సింగరాయపాలెంలో మంగళవారం పొలాలను పరిశీలించి, స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మండలంలో 90 శాతం వరకు నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేశారన్నారు. దీని వలన కలుపు సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. దీని నివారణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పైరు నెల రోజుల దశలో ఉన్నట్లయితే గడ్డిజాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటాయన్నారు. దీని నివారణకు సంబంధించిన మందులను రైతులకు సూచించారు. అదేవిధంగా వెడల్పాకు కలుపు మొక్కలు ఉన్నట్లయితే 2, 4 డీ సోడియం సాల్ట్ మందును ఎకరానికి 400 నుంచి 500 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఎండాకు తెగులును తట్టుకొనుటకు తొలిదశలో ఎకరాకు 20 కేజీల చొప్పున పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. పొలాలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తల వెంట మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ ఉన్నారు.

15 మంది అధ్యాపకులకు డాక్టరేట్లు



డాక్టరేట్లు సాధించిన అధ్యాపకులతో ప్రిన్సిపాల్ కరుణకుమార్ తదితరులు

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 15మంది అధ్యాపకులకు వివిధ విశ్వవిద్యాలయాల ద్వారా డాక్టరేట్లు లభించాయి. పీహెచ్‌డీ పట్టాలు పొందిన గరిమెళ్ల భారతి, గుండిగ రాజాకుమార్, వి.ఫణికుమార్, అబ్దుల్ మతిన్, బి.శ్రీనివాసుకుమార్, పి.అశోక్‌రెడ్డి, తెనాలి నాగమణి, పి.తేజోమూర్తి, ఎస్.భవాని, కె.పృథ్వీరాజ్, టి.హేమంత్‌కుమార్, బి.నాగశిరీష, పి.ఆంజనేయరాజు, బి.వంశీకృష్ణ, ఎ.అపర్ణను మంగళవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ అభినందించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి రామకృష్ణ, సలహాదారులు డాక్టర్ పి.రవీంద్రబాబు, డాక్టర్ ఎం.కామరాజు, డాక్టర్ జి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, అధ్యాపకులు అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ మంచాల సరస్వతి ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో ఏడు రోడ్ల సీసీ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించి తొలుత ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలోని అంతర్గత రోడ్లన్నీ పూర్తి స్థాయిలో సీసీ రోడ్లుగా మార్పు చెందుతాయని తెలిపారు.

ట్రాఫిక్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీకి బొకే అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాదరావు

గుడివాడరూరల్: గుడివాడ ట్రాఫిక్ ఎస్‌ఐ జీవీ ప్రసాదరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాదరావుకు ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలోని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

కాకరవాడ సర్పంచ్ మృతి



రామారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని కాకరవాడ సర్పంచ్ కాగిత రామారావు (70) మంగళవారం మృతి చెందారు. రామారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. రామారావు 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) రామారావు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టించి పని చేసిన రామారావు మృతి తీరని లోటుగా మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, శీలం రామకృష్ణ, బేతపూడి వెంకటరమణ, కోమటి విష్ణువర్ధన్, బత్తిన కిషోర్, గణేషుల సురేష్, సాక్షి సాయిబాబు, మరీదు రాధా, నాని, రామారావుకు నివాళులర్పించారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



తహసీల్దారు ఉదయ భాస్కరరావు

కైకలూరు: మండల తహసీల్దారుగా ఎం.ఉదయభాస్కరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన పిఠాపురం నియోజకవర్గంలో గొల్లప్రోలు మండలం నుంచి బదిలీపై కై కలూరుకు వచ్చారు. గతంలో ఎన్నికల విధుల నిమిత్తం తహసీల్దారుగా వచ్చిన పోతురాజు కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలను సంతృప్తికర స్థాయిలో అందిస్తామన్నారు.

విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలి

డీవైఈఓ శేఖర్ సింగ్



పెడన: మధ్యాహ్న భోజనం విషయంలో విద్యార్థులలో కొన్ని అపోహలున్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మచిలీపట్నం డీవైఈఓ శేఖర్‌సింగ్ అన్నారు. డీఈఓ తాహెరాసుల్తానా ఆదేశాలతో మంగళవారం డీవైఈవో శేఖర్ సింగ్ పదో తరగతి విద్యార్థులతో మమేకం అవ్వడంతో పాటు వారికి మోటివేషన్ క్లాసులు తీసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సోమవారం రెండున్నర గంటల పాటు డీఈఓ ఈ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఈ విషయమై 'బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో డీఈఓ విచారణ' అంటూ 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన వార్త పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో డీవైఈఓ శేఖర్ సింగ్‌ను మంగళవారం ఉదయమే పాఠశాలను సందర్శించి పరిస్థితిని నివేదిక రూపంలో ఇవ్వాలని డీఈఓ ఆదేశాల మేరకు శేఖర్‌సింగ్ పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి ఎంత మంది భోజనం చేస్తున్నారనే వివరాలను మధ్యాహ్న భోజనం ఏడీ మనోహర్‌నాయక్‌తో కలిసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో శేఖర్ సింగ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పట్ల 9, 10వ తరగతి విద్యార్థులు విముఖత చూపుతున్నారని, అదేమని వారిని ప్రశ్నిస్తే వంటికి పడటం లేదని చెబుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకుని మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. చిన్న తరగతులకు చెందిన విద్యార్థులు బాగానే భోజనం చేస్తున్నారని, ఉపాధ్యాయులను ఆయా సబ్జెక్టులు వారీగా బోధనకు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలను తరుచూ తనిఖీ చేస్తామన్నారు. పొరబాట్లను సరిదిద్ది పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం తీర్థావతి పాల్గొన్నారు.

పీఎఫ్ సక్రమంగా అందించేందుకు చర్యలు

మచిలీపట్నంటౌన్: నగరంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ సొమ్ము సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ వివరాల ఆన్‌లైన్ విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు ఎంత పూర్తయిందో సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని వేగంగా నిర్వహించి వారికి మేలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



గుడివాడలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



రాపర్లలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న కార్యదర్శి



గుడ్లవల్లేరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వాణి

సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్

గుడివాడరూరల్: తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ గుడివాడ ప్రాజెక్టు సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని మోటూరు సెక్టారు పరిధిలోని శ్రీదేవినగర్, శ్రీకాళహస్తీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషక ఆహారాన్ని అందిస్తుందన్నారు. పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వర్షాకాలం వలన డయేరియా సోకే ప్రమాదం పొంచి ఉందని ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీరున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు జయప్రద, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నందివాడ మండలంలో..

తల్లిపాల వారోత్సవాలను మండలంలోని పుట్టగుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగశిరీష మాట్లాడుతూ తల్లిపాలు తప్పనిసరిగా బిడ్డలకు తల్లులు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.రత్నకుమారి, కె.తేజశ్రీ, ఎం.మహాలక్ష్మి పాల్గొన్నారు.

నాగాపురంలో..

నాగాపురం(పెదపారుపూడి): మండలంలోని నాగాపురం, యలమర్రు గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పెదపారుపూడి మండలంలోని నాగాపురంలో వెంట్రప్రగడ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అందిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. యలమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో పెదపారుపూడి సెక్టార్ సూపర్‌వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేయస్కరమన్నారు. నాగాపురం సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాపర్లలో..

రాపర్ల(పామర్రు): తల్లిపాలు బిడ్డకు అమృతంలా పని చేస్తాయని గ్రామ కార్యదర్శి వీఎల్ఎస్ కృష్ణ అన్నారు. పామర్రు మండలం రాపర్ల సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువు జన్మించిన అరగంటలోపుగా తల్లి ముర్రుపాలను పట్టించాలన్నారు. దీని వలన చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ కాకర్ల నాగమణి, సచివాలయ మహిళా పోలీస్ రత్నమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తోట్లవలూరులో..

తోట్లవల్లూరు: తల్లి పాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కే నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లి పాల విశిష్టతను నాగమల్లేశ్వరి వివరించటంతోపాటు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ నీలవేణి, ఎంఎస్‌కే మనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, మహాలక్ష్మి, శివగంగ పాల్గొన్నారు.

బాపూజీ నగర్‌లో..

గుడివాడ టౌన్: స్థానిక సెక్టార్–1 బాపూజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన వారోత్సవాల్లో సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్ బిడ్డ జన్మించిన గంటలోపు ముర్రిపాలు బిడ్డకు అందించడం వలన బిడ్డకు కలిగే లాభాలను తల్లులకు వివరించారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఆర్గనైజర్ రామారావు, ఏరియా ఇన్‌చార్జి ఎండీ రబ్బాని, సూపర్‌వైజర్ ఆరీఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



నాగాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శివనాగమణి

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అవగాహన కల్పించారు. గుడ్లవల్లేరులో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యురాలు యశస్విని పిల్లలకు తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.జయలక్ష్మి, వాణి, భవాని, రజనీ పద్మజ, మౌనిక గ్రేస్, విజయకుమారి, నాగరాజ కుమారి, ధనలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాల విలువ తెలుసుకోవాలి

కైకలూరు: బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని వరహాపట్నం సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వరహాపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులకు తల్లిపాల ప్రాధాన్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ తల్లిపాలలో బిడ్డకు అవసరమైన రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

ముదినేపల్లి రూరల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు జాబు కార్డులపై బుధవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో గ్రామాలు వదిలి వెళ్లిన, చనిపోయిన వారి వివరాలను గుర్తించడంతోపాటు కొత్తగా జాబు కార్డులు కావాల్సిన వారి వివరాలు సేకరించి 15 రోజుల్లో కార్డులు అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నెల 7న విరావిగుంట, సంఘర్షణపురం, ములకలపల్లి, 8న పెదకామనపూడి, చేవూరు, చినకామనపూడి, కోమర్రు, చినపాలపర్రు, దాకరం, 9న ఈడేపల్లి, పేరూరు, దేవపూడి, ప్రొద్దువాక, పెనుమల్లి, కోడూరు, 12న శ్రీహరిపురం, వాడవల్లి, సింగరాయపాలెం, 13న పెయ్యేరు, వడాలి, వైవాక, 14న గురజ, ముదినేపల్లి, బొమ్మినంపాడు, చిగురుకోట, పెదగొన్నూరులో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరు పాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు నిర్వహించారు.